క్లుప్తంగా

శాస్త్రోక్తంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో త్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ, పంచహారతులు తదతర కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను ఆలయ అర్చకులు చేపట్టారు.

బహుముఖ ప్రతిభాశాలి దాశరథి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి దాశరథి కృష్ణామాచార్యులు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు పేర్కొన్నారు. నగర సాంస్కృతిక సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో దాశరథి శతజయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ తెలంగాణా సాయిధ పోరాటంలో దాశరథి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ దాశరథి పాటల రేడు అని.. అవి తెలుగు సాహితీ వైభవానికి తీపి గురుతులని పేర్కొన్నారు. అతిథులు దాశరథి చిత్ర పటానికి నివాళులు సమర్పించారు. గాయనీ గాయకులు దాశరథి చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కే వెంకటేశ్వరరెడ్డి, కందుకూరి రవిబాబు, ఆర్ మధుసూధనరావు, మారేపల్లి జోషి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నిరోధకంపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారి మాల్యాద్రి తెలిపారు. వీఎంసీ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని శ్రీ వత్స, ట్విల్స్ మాల్స్‌ల్లో అగ్నిప్రమాద నిరోధక యంత్రాల పనితీరును మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా సంస్థల్లో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానాన్ని వివరించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎలాంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు.

విజయవాడ డివిజన్ సమస్యలు పరిష్కరించండి

– రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్‌కుమార్‌కు ఎంపీ చిన్ని వినతి

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడ రైల్వే డివిజన్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్‌కుమార్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కోరారు. ఢిల్లీలో మంగళవారం ఎంపీ చిన్ని సతీష్ కుమార్‌ను కలిసి పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. 'విజయవాడ రైల్వే డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న లెవెల్ క్రాసింగ్ నంబర్ 316(విజయవాడ – గుణదల), లెవెల్ క్రాసింగ్ 147(రాయనపాడు – కొండపల్లి), లెవెల్ క్రాసింగ్ 148(విజయవాడ – రాయనపాడు), లెవెల్ క్రాసింగ్ నంబర్ 8(విజయవాడ – రామవరప్పాడు), వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌లు(ఆర్ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జ్‌లు (ఆర్‌యూబీ) నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అమృత భారత స్టేషన్ 2.0 పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నీతి ఆయోగ్ మంజూరు చేసిన రూ.836.47 కోట్ల నిధులను రైల్వే శాఖ త్వరగా విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

12 మంది జూదరుల అరెస్ట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గొల్లపూడి గ్రామంలోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్ పక్కన పేకాట ఆడుతున్న 12న మందిని భవానీపురం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పేకాడుతున్నారన్న సమాచారం మేరకు సెక్టార్ ఎస్ఐ రవితేజ సిబ్బందితో వెళ్లి దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. 12 మందిపై కేసు నమోదు చేశారు.

వైభవంగా సారె సంబరం



ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్త బృందాలు మంగళవారం ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి సారెను సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, పలు రకాల స్వీట్లు, ఫలాలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి సారెను సమర్పించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వర్షపు నీటి తొలగింపుపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): వర్షపు నీరు రోడ్‌పై నిలవకుండా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బెంజిసర్కిల్, నిర్మలా కాన్వెంట్ రోడ్, పోస్టల్ కాలనీ రోడ్, పంట కాలువ రోడ్, ఏపీఐఐసీ కాలనీ, ఆయుష్ హాస్పటల్ రోడ్, రామవరప్పాడు జంక్షన్, ఏలూరు రోడ్, గుణదల సెంటర్ ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు.

ఆక్రమణలను తొలగించాలి..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒక ఎనిమిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలతో కూడిన మాన్సూన్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో గుర్తించిన స్టాగ్నేషన్ పాయింట్లలో ఒక్కో పాయింట్‌కు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైతే మోటార్ల సామర్థ్యతను పెంచి వర్షపు నీరు ఎక్కువగా నిలవ ఉండే ప్రాంతాల్లో 10 నిమిషాల కంటే ఎక్కువ సేపు నిలవ ఉండకుండా చూడాలన్నారు. వర్షపు నీరు ప్రవాహానికి అడ్డొచ్చే ఆక్రమణలను తొలగించాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో గుర్తించిన రిహాబిలిటేషన్ సెంటర్లలో ఎటువంటి మరమ్మతులు లేకుండా కనీస వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ పర్యటనలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయొద్దని వినతి



స్థానికులతో మాట్లాడుతున్న సుజనా చౌదరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం సితార జంక్షన్ సమీపంలోని బైపాస్ రోడ్‌లో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనపై స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయవద్దన్న స్థానికులు వినతిపై పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ(సుజనా) చౌదరి మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇక్కడ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయటం వలన అసాంఘిక కార్యక్రమాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బైపాస్ రహదారి 200 అడుగుల వెడల్పు ఉన్నందున రెండు వైపులా ఓపెన్ డ్రెయిన్లు నిర్మించి సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఫుడ్ కోర్ట్‌ను ఏర్పాటు చేయాలంటే లేబర్‌కాలనీ గ్రౌండ్ ఈశాన్యం వైపున ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ బైపాస్ రహదారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫుడ్ కోర్ట్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలనేది తరువాత ఆలోచిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో స్థానిక లక్ష్మీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం రామలింగేశ్వరరావు, స్థానికులు పరిమి మల్లేశ్వరరావు, దేవరపు సూర్యనారాయణ, పి.మాలకొండయ్య, చుంచు సురేష్, డీ శ్రీను, రాంపిళ్ల వెంకట రమణ, గాదె సుబ్బారెడ్డి, రైస్ వెంకట స్వామి, బాలాజీనగర్ వాసులు, 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య తదితరులు ఉన్నారు.

దుర్గమ్మ దర్శనం సులభతరం చేయడమే లక్ష్యం



కనకదుర్గా నగర్‌లో పార్కింగ్ గురించి చర్చిస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. దుర్గగుడి పరిసరాల్లో ఈవో శీనానాయక్, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ , ట్రాఫిక్ పోలీసు అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. దుర్గాఘాట్‌ను పరిశీలించిన అధికారులు అక్కడ చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. నదీతీరానికి పుణ్యస్నానాలకు విచ్చేసే భక్తులు తమ లగేజీ, సెల్‌ఫోన్లు, చెప్పులను భద్రపరుచుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. అదే విధంగా భక్తులు మెయిన్‌రోడ్డుపై నుంచి నడిచి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా అండర్ గ్రౌండ్ ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు. కనకదుర్గానగర్, చైనా వాల్, విజయేశ్వర ఆలయం వద్ద వాహనాల పార్కింగ్ గురించి చర్చించారు. నూతన ప్లాన్ అమలు చేయడం వల్ల ఘాట్‌రోడ్డుపై రద్దీని నియంత్రించడంతో పాటు లిఫ్ట్ ద్వారా వెళ్లే భక్తులకు సులభంగా అమ్మవారి దర్శనం అవుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేసేందుకు ఈ నెల 25, 26వ తేదీల్లో ట్రయల్ రన్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈవో వెంట దుర్గగుడి ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార గృహం నిర్వాహకురాలిని శిక్షించాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కాకినాడ జిల్లా, పెద్దాపురంలో వ్యభిచార గృహం నిర్వాహకురాలు భారతిని అరెస్ట్ చేసి శిక్షించాలని అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక డిమాండ్ చేసింది. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం బాధిత మహిళలకు రక్షణ కల్పించాలి–సెక్స్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. పెద్దాపురంలో స్థానిక పోలీస్ అధికారుల ప్రమేయంతో ఈ కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. సామాజిక కార్యకర్త వసుంధర మాట్లాడుతూ.. నిందితురాలైన భారతిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆమెకు సహకరించిన కానిస్టేబుల్, హోమ్ గార్డులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు డిమాండ్ చేశారు. సమావేశంలో అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక నాయకులు గంగాభవాని, పద్మ, రాణి, మాల్యాద్రి, దివ్య, సయ్యద్ బేగం, లక్ష్మీ ప్రసన్న, స్వరూపారాణి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో అనధికార పార్కింగ్



బస్టాండ్ డిపార్చర్ బ్లాక్‌లో నిలిపిన వాహనాలు



సిటి టెర్మినల్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాల అనధికాక పార్కింగ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ ఆవరణలో వాహనాల పార్కింగ్ సౌకర్యం ఉన్నా, వాహనదారులు వారి వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తున్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. దీనిపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– బస్టాండ్(విజయవాడపశ్చిమ)

బైపాస్ రోడ్‌లో ఫుడ్ కోర్ట్‌ను వ్యతిరేకిస్తున్నాం

వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి బైపాస్ రహదారిలో ఫుడ్ కోర్ట్‌ను ఏ విధంగా ఏర్పాటు చేస్తారో స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి, అనుమతులు ఇవ్వడానికి సిద్ధపడిన అధికారులు పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన వెంకట మహేష్ ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. సితార జంక్షన్ నుంచి హౌసింగ్‌బోర్డ్‌కాలనీ వరకు పదుల సంఖ్యలో బార్‌లు, వైన్ షాపులు ఉన్నాయని గతంలోనే వీడియోలతో సహా బయట పెట్టామని గుర్తు చేశారు. అక్కడ మద్యం సేవించిన వారికి టచ్చింగ్ కోసం ఈ ఫుడ్ కోర్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారా అంటూ సుజనా చౌదరిపై ధ్వజమెత్తారు. ఈ ప్రాంతంలో ఫుడ్ కోర్ట్ పెట్టడం వలన భవానీపురం, విద్యాధరపురం, ఏకలవ్యనగర్, ఊర్మిళానగర్, కబేళా సెంటర్ తదితర ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు తీవ్ర నష్టపోతారన్నారు. అదే విధంగా బైపాస్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రజలు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందన్నారు. నిత్యం రద్దీగా ఉండే బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేయవద్దని సుజనా చౌదరి, అధికారులను డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా కేవలం కొద్ది మంది ప్రయోజనాల కోసం ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేస్తే ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టం చేశారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



గాంధీనగర్‌లో ప్రభుత్వం అటాచ్ చేసిన అగ్రిగోల్డ్ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ చైతన్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను రూపొందించడం జరిగిందని విజయవాడ ఆర్డీవో కె. చైతన్య తెలిపారు. రాష్ట్ర భూపరిపాలన శాఖ, కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో మంగళవారం అగ్రిగోల్డ్ భూముల ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టారు. దీనిలో భాగంగా రెవెన్యూ, నగరపాలక సంస్థ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ తదితర విభాగాలకు చెందిన జిల్లాస్థాయి కమిటీ, సీఐడీ డీఎస్పీ పి.శ్రీనివాస్, విజయవాడ ఆర్డీవో కె.చైతన్యలు గాంధీనగర్‌లోని జయరాం థియేటర్ సమీపంలో అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన భూమిని పరిశీలించారు. సంబంధిత భూమిని రీ సర్వే, భౌతిక పరిశీలన నిర్వహించారు. అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూమి విలువతోపాటు మార్కెట్ విలువను కూడా లెక్కించి జిల్లా రిజిస్ట్రార్ సహకారంతో వివరాలను నివేదికలో పొందుపరచడం జరుగుతుందని చెప్పారు. ఆయా భూముల ప్రభుత్వ విలువ సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి, మార్కెట్ విలువను అధికారిక ఏజెన్సీ నుంచి పొంది మ్యూటేషన్ పనులు పూర్తిచేయడం జరుగుతుందని ఆర్డీవో చైతన్య పేర్కొన్నారు.

విద్యార్థినులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



దినేష్‌కు జ్ఞాపికను అందిస్తున్న స్టెల్లా కళాశాల యాజమాన్య ప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): జాబ్ మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా విద్యార్థినులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఐటీసీ అకాడమీ ప్రాజెక్ట్ మేనేజర్ ఐసీటీ అకాడమీ దినేష్ అన్నారు. స్టెల్లా కళాశాలలో మంగళవారం ఇన్ఫోసిస్ సీఎస్ఆర్ ఫినిషింగ్ స్కూల్ ఎంప్లాయిబిలిటీ ప్రోగ్రామ్ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు డిగ్రీతో పాటు అదనపు నైపుణ్యాలు లేకపోతే రాణించలేరని, డిగ్రీతో పాటుగా జాబ్ మార్కెట్ డిమాండ్ల అనుగుణంగా ప్రొఫెషనల్ స్కిల్స్‌ను మెరుగు పరచుకుంటేనే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడగలరన్నారు. విద్యార్థులకు ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నైపుణ్యాన్ని సాధించాలని, ఈ ప్రాజెక్ట్‌ను డిగ్రీ విద్యార్థినుల కోసం ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంస్థలతో కలిసి ప్రారంభించామని చెప్పారు. కాలేజీ కరెస్పాండెంట్ డాక్టర్ సిస్టర్ లీన క్వద్రస్ మాట్లాడుతూ ఇన్ఫోసిస్ ఫినిషింగ్ స్కూల్ ఎంప్లాయిబిలిటీ ఐసీటీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులు 100 పని గంటలు వచ్చే విధంగా ఈ కోర్సు డిజైన్ చేయించామని, కమ్యూనికేషన్ స్కిల్స్, లాజికల్ థింకింగ్, రీజనింగ్ క్రిటికల్ థింకింథింకింగ్ మెంటల్ ఎబిలిటీ, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ వంటి అంశాలు విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు. వీటితో పాటు జాబ్ మార్కెట్‌లో పోటీని తట్టుకుని నిలబడేలా, పోటీ పరీక్షకు తగిన విధంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. ట్రైనింగ్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థినికి సర్టిఫికెట్ ఇస్తామని, ఇది వారి ప్రొఫెషనల్ గ్రోత్‌కు ఉపయోగపడుతుందని కామర్స్ విభాగాధిపతి పూజిత తెలిపారు. డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషా కుమారి, అధ్యాపకులు పద్మజ, కామర్స్, బీబీఏ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



బీఆర్టీఎస్ రోడ్డులో వీక్ వాకథాన్ నిర్వహిస్తున్న బ్యాంక్ అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ సీవీఎస్ భాస్కరరావు, రీజినల్ హెడ్ ఎంవీ తిలక్ పేర్కొన్నారు. బీఆర్టీఎస్ రోడ్డులో మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) రీజినల్, జోనల్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యాన హెచ్ఆర్ వీక్ – 2025 సందర్భంగా వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లాలో 73 బ్రాంచులు, 699 మంది సిబ్బందితో లీడ్ బ్యాంక్‌గా సమర్థవంతంగా బ్యాంకింగ్ సేవలందిస్తోందని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు, పథకాలపై అవగాహన కల్పించే విధంగా వాక్‌థాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. బ్యాంక్ సేవలు, పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శారదా కళాశాల నుంచి యూనియన్ బ్యాంక్ సిబ్బంది బ్యాంకు ప్రాముఖ్యత పథకాలను వివరిస్తూ వాక్‌థాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు నాగేంద్ర స్వామి కొండ ప్రాంతంలో శీల పద్మ, వెంకట్రావు దంపతులు నివాసం ఉంటారు. పద్మ ఇంటి వద్దే ఇస్త్రీ చేస్తుండగా, వెంకట్రావు తాపీపని చేస్తుంటాడు. ఈ నెల ఆరో తేదీన పనికి వెళ్లిన వెంకట్రావు రెండు వారాలు అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన పద్మ తెలిసిన వారికి, బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

26 మంది మందుబాబులకు జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని 5వ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 26 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని 6వ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి లెనిన్‌బాబు వారికి జరిమానాలు విధించారు. వారిలో ఆరుగురికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున, మిగిలిన 20 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానాలు విధించారు. ప్రతి రోజూ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీపీ ఎస్వీ రాజశేఖరబాబు చెప్పారు.